క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న జోగి రమేష్



జి.కొండూరు: కట్టుబడిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ మంగళవారం రాత్రి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు పరామర్శ

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ అధికార ప్రతినిధి కోమటి కోటేశ్వరరావును పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ఆయన ఎండగట్టారు. ఈ నేపథ్యంలో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంటికి వచ్చిన ఆయనను నాయకులు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ గుంజా శ్రీనివాస్ మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ నాయకత్వంలో ప్రభుత్వ వైఫల్యాలను ధైర్యంతో ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, వివిధ విభాగాల నాయకులు మిక్కిలి శరభయ్య, నల్లమోతు దయాకర్, కోలకాని శ్రీనివాసరావు, గోగులమూడి రాణి, ఈశ్వరి, ప్రకాశ్, రాజేశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేష్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు



మైలవరం: అధికార పార్టీ నాయకులు వారి స్థాయిని మరచి మాజీమంత్రి జోగి రమేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూటి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణ రెడ్డి అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోమటి కోటేశ్వరరావు అక్రమ అరెస్టుకు నిరసనగా మైలవరం సర్కిల్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలిపారని చెప్పారు. దీనిని ఉద్దేశించి అధికార పార్టీ నాయకులు కొందరు వారి స్థాయిని మరచి జోగి రమేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలు చేసిన వారు ముందుగా వారి స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. అధికార పార్టీ వారు మైలవరంలో కొత్త సంస్కృతికి తెరతీస్తున్నారని, వారు తమ తీరు మార్చుకోవాలని, లేకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

నూజివీడు: 73వ వార్షిక అఖిల భారత పురుషుల, మహిళల ఆహ్వాన కబడ్డీ పోటీలు నూజివీడులో బుధవారం నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక డీఏఆర్ కళాశాల ఆవరణలోని బాస్కెట్‌బాల్ కోర్టులో మ్యాట్‌లను ఏర్పాటు చేశారు. వర్షం వల్ల అవాంతరాలు ఏర్పడితే పక్కనే ఉన్న ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు.

బీమా నగదు అందజేత

చాట్రాయి: చాట్రాయి గ్రామానికి చెందిన సర్నాల మారేశ్వరరావు ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. జనతా యాక్సిడెంట్ బీమా పథకం కింద రూ.2 లక్షల నగదును పీఏసీఎస్ చైర్మన్ తుమ్మల రామ్మోహనరావు, సీఈఓ పాకాల శ్రీనివాసరావుల చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కాలసాని సత్యనారాయణ, తుమ్మల జగన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నరకమే!



తిరువూరు మండలం మునుకుళ్లలో అధ్వానంగా ఉన్న ఆర్ అండ్‌బీ రహదారి



తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామంలో రహదారి దుస్థితి

- రోడ్లపై అడుగడుగునా గుంతలు
- రాకపోకలకు ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు
- హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు

తిరువూరు: అడుగడుగునా గుంతలతో తిరువూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. వీటికి ఏడాదిన్నర కాలంలో కనీస మరమ్మతులు కూడా చేయకపోవడం, ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారులు మరీ దారుణంగా మారి రాకపోకలకు వీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ ఏమైందని తిరువూరు నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తిరువూరు నుంచి కోకిలంపాడు మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు గ్రామాలకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి సైతం అడుగడుగునా గుంతలు పడి ప్రమాదాలకు నెలవుగా మారింది. కోకిలంపాడు గ్రామ పరిధిలో రోడ్డు బురదమయమై ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు జారిపడుతున్నారు. గత ఏడాదిన్నర కాలంలో తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని పలు గ్రామీణ రహదారులు, ఆర్ అండ్ బీ రహదారులు గుంతలమయంగా మారి వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు కనీసం తట్ట మట్టి కూడా పోయలేదని విమర్శిస్తున్నారు.

నరకప్రాయంగా రహదారులు

ధ్వంసమైన రహదారులపై వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ ఈ రహదారుల్లో గుంతలు కనిపించకపోవడం, వర్షాలు పడితే నీటితో నిండిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తిరువూరు–మునుకుళ్ల ఆర్ అండ్ బీ రహదారి సైతం ఇదే పరిస్థితి. మునుకుళ్ల గ్రామంలో పలుచోట్ల ఈ రహదారి ధ్వంసమై గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా గంపలగూడెం మండలంలోని నెమలి, ఊటుకూరు, ఆర్లపాడు, గుళ్లపూడి, గాదెవారిగూడెం, తిరువూరు మండలంలోని ఎర్రమాడు, వావిలాల, పెద్దవరం, రాజుగూడెం, వామకుంట్ల, ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, గొల్లగూడెం గ్రామాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని రఘునాథ బంజరు, అక్కపాలెం, చంద్రుపట్ల తదితర గ్రామాలకు వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ముష్టికుంట్ల అడ్డరోడ్డు నుంచి కొమ్మిరెడ్డిపల్లి రహదారి, తిరువూరు–మల్లేల, ఎ.కొండూరు–విస్సన్నపేట రహదారులు కూడా పూర్తిగా గుంతలమయమయ్యాయి. తిరువూరు–రఘునాథ బంజరు రహదారి అక్కపాలెం వరకు ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా ఆర్ అండ్ బీ అధికారులు పునర్నిర్మించలేదు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు పలుమార్లు కోకిలంపాడు, అక్కపాలెం, కొమ్మిరెడ్డిపల్లి, మునుకుళ్ల తదితర గ్రామాల రహదారులను పునర్నిర్మిస్తామని హామీలిచ్చినా అమలుకు నోచలేదు.

రహదారులు నిర్మించాలి



తిరువూరు మండలంలోని గ్రామీణ రహదారులు, ఆర్ అండ్ బీ రహదారులు అధ్వానంగా మారాయి. కనీసం రాకపోకలకు వీలులేని రీతిలో ఉన్న ఈ రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నందున వెంటనే పునర్నిర్మించాలి. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా నిధులు కేటాయించి త్వరితగతిన పనులు చేపట్టాలి.

– డి. ఆనందరావు, సామాజిక కార్యకర్త

కనీస మరమ్మతులు లేవు



ధ్వంసమైన రహదారులకు కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు ప్రమాదాలబారిన పడుతున్నాం. గుంతల్లో నిలిచిన నీటి కారణంగా ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. వెంటనే రహదారుల దుస్థితిని గమనించి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మోదుగు శివయ్య, ముష్టికుంట్ల

వరద బాధితులకు జోగి రమేష్ పరామర్శ



పుష్కర నగర్ వాసులకు భోజనం వడ్డిస్తున్న జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: కృష్ణానది వరద ముంపునకు గురైన పుష్కర నగర్ ప్రాంతంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ మంగళవారం పర్యటించారు. ఆ ప్రాంతంలో ఇళ్లల్లోకి చేరిన నీటిని పరిశీలించారు. రోడ్డుపై సామగ్రి పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్న బాధితులను ఆయన పరామర్శించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పేదలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ తరఫున బాధితులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి వడ్డించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, పార్టీ వివిధ విభాగాల నాయకులు నల్లమోతు దయాకర్, గోగులమూడి రాణి, కుంచం జయరాజు, కోమటి కోటేశ్వరరావు, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సర్వ స్వరూపే.. సర్వశక్తి సమన్వితే



మైలవరంలో అమ్మవారి అలంకరణ



ఆగిరిపల్లిలో కనక దుర్గమ్మగా..



గంపలగూడెం మండలం ఊటుకూరులో అమ్మవారు



తిరువూరు రాజుపేటలో దుర్గామాతగా



నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

ఇబ్రహీంపట్నం: దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా 9వ రోజు మంగళవారం కనకదుర్గమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల్లోని దేవాలయాలు, చలువ పందిళ్లలో దుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

- బలివే (ముసునూరు): బలివేలోని బలేరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరి అమ్మవారు కనక దుర్గాదేవిగా పూజలందుకున్నారు. గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, నాగేంద్రపురం, చెక్కపల్లి, వేల్పుచర్ల, రమణక్కపేటల్లోని శ్రీకోదండ రామాలయాల్లో, గుడిపాడు, వలసపల్లి శివాలయాల్లో, గోగులంపాడు గోగులమ్మ ఆలయం వద్ద అమ్మవారికిప్రత్యేక పూజలు నిర్వహించారు. లోపూడిలోని కోదండ రామాలయం వద్ద అమ్మవారిని కనకదుర్గా దేవిగా అలంకరించి, భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు.
- విస్సన్నపేట: స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు, పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు మంగళవారం కనక దుర్గాదేవిగా పూజలందుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి పందిళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- జి.కొండూరు: జి.కొండూరు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం శ్రీ దుర్గాదేవిగా అలంకరించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



చాట్రాయిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దుర్గాదేవిగా మహిషమ్మ

నూజివీడు: పట్టణంలోని కోట మహిషాసుర మర్దని అమ్మవారు మంగళవారం దుర్గాదేవిగా పూజలందుకున్నారు. పట్టణంలోని కంచికామాక్షి ఆలయంలో, పాతపేటలోని జ్ఞానసరస్వతీ దేవాలయంలో, దత్తాశ్రమంలోని అమ్మవారికి, 32వ వార్డులోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గమ్మ వారికి, కోనేరుపేటలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారికి, జంక్షన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతీ ఆలయంలోని సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- చాట్రాయి: దేవీ నవరాత్రుల సందర్భంగా మంగళవారం కనకదుర్గ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని చాట్రాయి, సి గుడిపాడు గ్రామాల్లో అన్నదానాలు జరిగాయి.
- మైలవరం: మైలవరం కేడీసీసీ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరిలో అమ్మవారు మంగళవారం మహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. మైలవరం కార్‌స్టాండ్, తారకరామా నగర్‌లో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.
- ఆగిరిపల్లి: స్థానిక రుద్రభూమి వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు, రజక వీధిలో దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. సాయంత్రం భవానీలు, భక్తులు దీపోత్సవం నిర్వహించారు. ఈదులగూడెం, వట్టిగుడిపాడులో కనకదుర్గమ్మను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.
- తిరువూరు: నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో ధనలక్ష్మీ దేవిగా, తిరువూరు శాంతినగర్ కనకదుర్గాలయం, రామలింగేశ్వరాలయం, చంద్రమౌళీశ్వరాలయం, గౌరీ కేదారేశ్వరాలయం, షిర్డీసాయి మందిరం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, గంపలగూడెం రామాలయం వీధి, ఊటుకూరు, ఎ.కొండూరు మండలం గోపాలపురంలో దుర్గాదేవి అలంకారంతో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. గంపలగూడెం మండలం పెనుగొలను శివాలయంలో పూజలు జరిగాయి. ఊటుకూరు దుందిరాలపాడు రోడ్డులోని నవరాత్రి ఉత్సవ పందిరిలో వైఎస్సార్ సీపీ నేత ఆలపాటి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



కిలేశపురంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కొండపల్లి మార్కెట్ సెంటర్‌లో దుర్గాదేవిగా..



బలివేలో అమ్మవారు



విస్సన్నపేటలో కనకదుర్గా దేవిగా..



జి.కొండూరు బీసీ కాలనీలో అలంకరణ



దుర్గాదేవిగా కోట మహిషమ్మ అమ్మవారు

గ్రామ దేవతలకు బోనాల సమర్పణ



జి.కొండూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా మునగపాడు గ్రామంలో గ్రామ దేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల నుంచి బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని మహాలక్ష్మమ్మ, ముత్యాలమ్మ, గంగానమ్మ, దుర్గమ్మ, బొడ్రాయిలకు బోనాలు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 'సేవ పక్వాడ్' కార్యక్రమంలో భాగంగా కొండపల్లిలో కబడ్డీ పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలను బీజేపీ జిల్లా కార్యదర్శి మారాసు కృష్ణమోహన్ ప్రారంభించారు. తొలుత కొండపల్లి నాగార్జున టీమ్, కిలేశపురం టీమ్‌లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కిలేశపురం టీమ్ విజయం సాధించింది.

5న నేత్ర వైద్య శిబిరం

ఆగిరిపల్లి: అడవినెక్కలంలో సుదీక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 5వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు చిగురుపాటి విమల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేస్తామన్నారు.

సరిహద్దు వివాదంలో ఇద్దరికి గాయాలు

ముసునూరు: సరిహద్దు వివాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. బలివే గ్రామానికి చెందిన గండికోట నరసమ్మ(50)కు, ఆమె తమ్ముడు కుప్పాల మల్లేశ్వరరావుకు మధ్య ఇంటి సరిహద్దు వివాదం ఉంది. ఈ విషయమై సోమవారం మరోసారి గొడవపడ్డారు. ఈ క్రమంలో మల్లేశ్వరరావు ఆగ్రహంతో అక్క నరసమ్మను కర్రతో కొట్టగా ఆమె చేయి విరిగింది. అడ్డువచ్చిన ఆమె కుమార్తె కృష్ణవేణిని కూడా మల్లేశ్వరరావు గాయపర్చాడు. బాధితులు నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ముసునూరు: కడపలో జరుగనున్న తొమ్మిదవ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మండల కన్వీనర్ వేముల బక్కయ్య పిలుపునిచ్చారు. రమణక్కపేటలో మంగళవారం మండల కమిటీ సభ్యుడు కొడపాక రామకృష్ణాచారి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 6, 7 తేదీల్లో కడపలో జరుగనున్న రాష్ట్ర మహాసభలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య హాజరవుతారన్నారు.

నిలకడగా కృష్ణానది వరద ప్రవాహం



ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద పుష్కర నగర్‌లో ఇళ్ల మధ్యలో నిలిచిన వరద నీరు



ఫెర్రీ లాంచీల రేవు వద్ద నదిని దాటుకుని రోడ్డుపైకి చేరిన వరద నీరు

ముంపులోనే పుష్కర నగర్, ఇసుక క్వారీ ఏరియా

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి వరదనీటి ప్రవాహం మూడు రోజులుగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రకాశం బ్యారేజీకి మంగళవారం వరద నీటి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఇబ్రహీంపట్నం ఫెర్రీ లాంచీల రేవు వద్ద నదిని దాటుకుని రోడ్డుపైకి వరద నీరు చేరింది. ఆ ప్రాంతంలో ఉన్న చిరు వ్యాపారులు, చేపల వ్యాపారులు వ్యాపారాలు నిలిపివేసి బయటకు వచ్చే పరిస్థితి నెలకొంది. సమీపంలోని పుష్కర నగర్‌తో పాటు ఇసుక క్వారీ ప్రాంతంలో ఇళ్లు నీటి ముంపులోనే ఉన్నాయి. బాధితులను రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు అన్నం తప్ప ఏ సదుపాయం కల్పించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. మినుము, మునగ పొలాల్లో మూడు రోజులుగా వరదనీరు నిలిచి ఉంది. లంక గ్రామాలకు రహదారి కష్టాలు కొనసాగుతున్నాయి.

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

తిరువూరు: తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే మీరా అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ నాయకులు తిరువూరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పనిచేసే 30 మందికి పైగా కార్మికులకు కాంట్రాక్టరు జీతాలు చెల్లించకపోవడంతో ఆయా కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. అరకొరగా జీతాలిస్తూ నెలల తరబడి జీతాలు పెండింగ్ పెట్టడం శోచనీయమని చెప్పారు. వెంటనే జీతాలు చెల్లించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.